క్లుప్తంగా

పేద విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం పంపిణీ


విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న డాక్టర్ నాయుడు

అగనంపూడి: నిరుపేద విద్యార్థికి స్థానిక వైద్యుడు కె.జె.నాయుడు ఉచితంగా నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందించారు. దిబ్బపాలెంకు చెందిన కర్రి రమేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇంటికే పరిమితం కావడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్న రమేష్ కుమార్తె చదువుకు కూడా ఇబ్బందులు ఎదురవడంతో, పరిస్థితి తెలుసుకున్న డాక్టర్ నాయుడు ఆమెకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫాం అందించారు. కార్యక్రమంలో బొండా ఈశ్వరరావు, గుడే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం శానిటరీ వర్కర్ల వినతి

దాబాగార్డెన్స్: గతేడాది డిసెంబర్ నుంచి జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామని పలువురు శానిటరీ వర్కర్లు సోమవారం జీవీఎంసీ సీఎంవోహెచ్‌కు వినతిపత్రం అందజేశారు. జోన్-6 పరిధిలో డే అండ్ నైట్ పారిశుధ్యం శుభ్రం చేసేందుకు ఏడాది కిందట నియమితులయ్యారు. ఆరు నెలలు కావస్తున్నా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఫీజులు కట్టలేక, పుస్తకాలు కొనలేక అవస్థలు పడుతున్నామని, మానవతా దృక్పథంతో ఆలోచించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ఎల్.వి.రమణ, గంగవరం గోపీ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1229వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఓపక్క ప్రైవేటీకరణ జరగదని ప్రకటిస్తున్నా.. మరోపక్క ప్రైవేటీకరణ యత్నాలు ముమ్మరంగా సాగుతుండడం అన్యాయమన్నారు. సెయిల్‌లో విశాఖ ఉక్కును విలీనం చేసి సొంత గనులు కేటాయిస్తే ఏడాదిలో కర్మాగారానికి పూర్వ వైభవం చేకూరుతుందన్నారు. ఆ దిశగా నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.అప్పారావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వామికి సహస్ర నామార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమ వారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం జరిపారు. అనంతరం సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

- బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చాలి
- ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ



విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్న ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ

పెదగంట్యాడ: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు వారిని బడిలో చేర్చాలని సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం దుర్గవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకోవాల్సిన వయసులో బాలబాలికలు పనులకు వెళ్లరాదన్నారు. పేద విద్యార్థులను విద్యావంతులను చేసేందుకు ప్రభుత్వం అనేక వనరులు కల్పిస్తోందని, తల్లిదండ్రులు ఈ అవకాశాలను అందిపుచ్చుకుని పిల్లలను విద్యావంతులను చేయాలని కోరారు. భారతదేశం బాల కార్మికులు లేని దేశంగా ఉండాలని, అప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజ వేస్తుందని చెప్పారు. అనంతరం ఎంఐఎస్ వినోద్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుశీల, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ విద్యార్థులతో కలసి దుర్గవానిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ బడికి పోతా కార్యక్రమాన్ని జూలై 25 వరకు మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమం విజయవంతానికి సచివాలయ సిబ్బంది, సీఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు సంయుక్తంగా కృషి చేయాలని కోరారు. ఇంటింటికీ తిరిగి ఐదేళ్లు దాటిన ప్రతీ ఒక్కరినీ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత ప్రాంతంగా ఆటోనగర్


ఆటోనగర్ ఎఫ్-బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను కాలుష్యరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఏడీ చంద్రమౌళి కోరారు. ఆటోనగర్ ఎఫ్- బ్లాక్‌లో ఎంఎస్ఎంఈ, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో ప్రతీ పారిశ్రామిక వేత్త ఆచరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ అధికారులు, సిబ్బంది, వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఐలా సిబ్బంది స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్-బ్లాక్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆటోనగర్ వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండు రంగప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఏడీ ఎఫ్-బ్లాక్‌లో పలు పరిశ్రమల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, ఏడీలు శ్రీను, మూర్తి, రెడ్డి, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి పర్వారి ప్రభాకర్, కేపీఎస్ రాజు, రెడ్డి, కృష్ణ ప్రసాద్, ప్రశాంత్, నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన కళాజాత


బాల్య వివాహాలు వద్దంటూ కళాజాతలో వివరిస్తున్న కళాకారులు

పెదగంట్యాడ: బాల్యవివాహాలు వద్దంటూ కళాజాత కళాకారులు వివరించిన తీరు పలువురిని ఆలోజింపచేసింది. బాలికలను రక్షిద్దాం, వారిని చదివిద్దాం అంటూ వారు ప్రదర్శించిన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఇస్లాంపేట సెక్టార్ పరిధిలోని చేపలపాలెం, యలమంచిలి దొడ్డి, దేవాడ, ఇస్లాంపేట, మదీనా బాగ్‌లో సోమవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కుల చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బోడిపిల్లి సోమేశ్వరి, వై.లక్ష్మి, సాయమ్మ, హసీనా బేగం, జాకీరా బేగం, మహిళా పోలీసులు భాగ్యశ్రీ, అనుశ్రీ, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి నక్షత్ర హారతి

- షీలానగర్‌లోని ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు
- కనులపండువగా మెట్ల పూజ


నక్షత్ర హారతి అందుకుంటున్న స్వామి అయ్యప్ప


ఆలయంలో 18 మెట్లకు చేసిన దీపాలంకరణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 34వ పవిత్రోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ నెల 16న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సోమవారం నక్షత్ర హారతి నిర్వహించారు. ఆలయంలో కొలువైయున్న గణపతి స్వామికి, కుమార స్వామికి, ఈశ్వరునికి, పార్వతీ దేవి ఆలయాలకు దీపాలంకరణ చేపట్టారు. దేవతలకు హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణ ఆధ్వర్యంలో ఆలయంలో భజన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆరాట్టు, జెండా అవరోహణ జరగనున్నట్లు అయ్యప్ప దేవాలయ సమితి అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు తెలిపారు.

కమిషనర్ దృష్టికి స్థానిక సమస్యలు


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ పరిధిలోని సెల్లార్లలో పార్కింగ్ సదుపాయం చూపించకుండా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్న షాపింగ్ మాల్స్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు పట్టా రామ అప్పారావు, కసా పద్మరాజు, నిమ్మకూరి రమేష్ జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పరిస్థితిని కమిషనర్‌కు వీడియో ద్వారా వివరించారు. రహదారులపై పార్క్ చేసే వాహనాలకు పెనాల్టీ విధించాలన్నారు. అలాగే, కూర్మన్నపాలెం హైవే నుంచి లంకెలపాలెం వరకు హిందూజా బొగ్గు లారీలు ఓవర్ లోడింగ్‌తో రవాణా చేయడం వల్ల బొగ్గు నేల రాలి, ఆ రవ్వల వల్ల వాహనచోదకులు కళ్ల మంటలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం సమీపంలో సౌత్ ఏసీపీ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న మురుగుకాలువలో అమర్చిన మంచినీటి పైప్‌లైన్ పగిలి ఫౌంటైన్ మాదిగా నీరు వృథా అవుతోందని, వాటిని అరికట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

బోసిపోయిన దువ్వాడ రైల్వేస్టేషన్

ప్రధాన రైళ్ల రద్దుతో ప్రయాణికులు రాక వెలవెల


దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫామ్‌లు

అగనంపూడి: విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్‌వంటి ప్రధాన నగరాల మధ్య నడుస్తున్న జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు రాక దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు సోమవారం బోసిబోయాయి. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల్లో అధిక శాతం మంది ఈ మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల మీదే ఆధారపడి ఉన్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేసే 24 జతల రైళ్ల ద్వారా ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారో ఈ మూడు రైళ్ల ద్వారా అంతమంది ప్రయాణం చేస్తారు. అలాంటి కీలకమైన రైళ్లన్నీ రద్దు చేయడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కుంటున్నారు. దీంతో రైల్వేస్టేషన్ బోసిపోయింది. ఈ మూడు రైళ్లు రద్దు కావడంతో వందలాది మంది డైలీ పాసింజర్లు కూడా ఇబ్బంది పడుతూ రోడ్డు రవాణా మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేతలకు అభినందనలు


తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేతలతో ఏసీపీ త్రినాథ్

ఉక్కునగరం: కళాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ విజేతలు కావడం అభినందనీయమని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీల్లో నృత్యనికేతన్ విద్యార్థులు 35మంది కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అందరూ విజేతలుగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా సోమవారం టౌన్‌షిప్‌లో నిర్వహించిన అభినందన సభలో ఏసీపీ త్రినాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఇతర రంగాలపై విద్యార్థులు మక్కువ పెంచుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రతిభ కలిగిన వారికి తప్పకుండా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డ్యాన్స్ టీచర్ కె.హైమావతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

శివుడి అవతారమే శంకరాచార్యులు

సీతంపేట: శంకరాచార్యులు సాక్షాత్ శివుడి అవతారమని కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని, సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైక్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్రవాఙ్మయం భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్


నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: ప్రతీ విద్యార్థి ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుని ఉండాలని గాజువాక ట్రాఫిక్ సీఐ కోటీశ్వరరావు సూచించారు. నియమాలు జాగ్రత్తగా పాటించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చన్నారు. షీలానగర్‌లోని మనీషా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు దాటేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సిగ్నల్ పాయింట్‌లో ఆచరించాల్సిన రూల్స్ వివరించారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాత, లైసెన్స్ కలిగి ఉంటేనే వాహనాలను నడపాలని స్పష్టం చేశారు. ప్రతీ వాహనం యొక్క అన్ని రికార్డులను కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్ ఫోన్లలో యాప్‌లను నమ్మవద్దని తెలిపారు. ప్రతీ యాప్‌పై క్లిక్ చేయవద్దని, సైబర్ క్రైం వలలో పడవద్దని సూచించారు. సెల్ ఫోన్లు దొంగతనాలు జరుగుతున్నాయని, జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు.

యూనియన్ బ్యాంక్ మెడిటెక్ శాఖ ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మెడిటెక్ సీఈవో, బ్యాంక్ జోనల్ హెడ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ దరి మెడిటెక్‌లో సోమవారం యూనియన్ బ్యాంక్ శాఖను ప్రారంభించారు. మెడిటెక్ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన శాఖ ప్రారంభ కార్యక్రమంలో మెడిటెక్ ఎండీ మరియు సీఈవో డాక్టర్ జితేంద్ర శర్మ మాట్లాడారు. మెడిటెక్‌లోని 30 కంపెనీల లావాదేవీలు జరిపేందుకు ఈ శాఖ దోహదపడుతుందన్నారు. శాఖ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ షాలినీ మీనన్ మాట్లాడుతూ 1919లో ప్రారంభించబడిన బ్యాంక్ శత సంవత్సరాలు పూర్తి చేసుకుని, దేశంలోని బ్యాంకుల్లో నాల్గో స్థానంలో ఉందన్నారు. బ్యాంక్ రీజనల్ అధికారి ఆర్.నరసింహ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ డి.ధనంజయ, ఏపీ మెడిటెక్ సిబ్బంది, రీజనల్, జోనల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'నిలిపివేసిన పనులు వెంటనే ప్రారంభించాలి'


ధర్నాలో ప్రసంగిస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కొన్ని విభాగాల్లో నిలిపివేసిన పనులను వెంటనే ప్రారంభించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ భవనం వద్ద సోమవారం ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ సీఎంఎస్‌లో గత 7 నెలలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు నిలిచి పోయాయన్నారు. అదే విధంగా బీఎఫ్, ఆర్ఎంహెచ్‌పీ, సీఈడీ విభాగాల్లో గత రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయన్నారు. దీని వల్ల సుమారు 100 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఈ పరిస్థితికి కారణం యాజమాన్యం నిర్లక్ష్యమేనని ఆరోపించారు. పనులు ప్రారంభించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓ.వి. రావు, నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, వి.వి. రమణ, నారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుకు ఊపిరివ్వండి

స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు


హెచ్ఎంఎస్ సమావేశంలో మాట్లాడుతున్న దొమ్మేటి అప్పారావు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు తీవ్రమైన సంక్షోభంలో ఉందని, కేంద్ర ప్రభుత్వం కావాలనే ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోందని స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నూతన వేతనాలు అమలు చేయడం లేదని, అదీగాక ప్రతి నెలా సమయానికి వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చత్తీస్‌ఘడ్‌లో సోమవారం నిర్వహించిన స్టీల్ మెటల్ అండ్ ఇంజినీరింగ్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిస్థితిపై మెటల్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్పందించి ఉక్కు మంత్రికి పరిస్థితిని విన్నవించాలని, ఉక్కుకు ఊపిరివ్వాలని కోరారు. అలాగే స్టీల్‌ప్లాంట్ సీఎండీకి కూడా ఒక లెటర్ రాయాలన్నారు. సెయిల్ మాదిరిగానే విశాఖ ఉక్కులో కూడా అన్ని బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. స్పందించిన మెటల్ ఫెడరేషన్ ప్రతినిధులు ఈ విషయాన్ని ఉక్కు మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అవసరమైతే విశాఖ ఉక్కు సీఎండీని కలిసి మాట్లాడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎన్‌జేసీఎస్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ సింగ్, సచ్చేంద్ర నాయక్, స్టీల్ మెటల్ అండ్ ఇంజినీర్ ఫెడరేషన్ అధ్యక్షుడు త్యాగి, కార్యదర్శి సంజోట్ వాడేకర్, హెచ్ఎస్ మిత్ర, లాల్, సుకాంత్ పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న యువకుడు

అక్కిరెడ్డిపాలెం: నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఘటనకు సంబంధించి, గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. ఈ నెల 19వ తేదీన అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మల్కాపురం నుంచి గాజువాక వైపు నడిచి వెళ్తుండగా గాజువాక ఆర్టీసీ డిపో సమీపానికి వచ్చేసరికి ఒక కారు వ్యక్తిని ఢీ కొనడంతో అతని తల వెనుక భాగం, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఒక సచివాలయ ఉద్యోగి, తోటివారి సహాయంతో క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై సచివాలయ ఉద్యోగి ఈ నెల 22న గాజువాక ట్రాఫిక్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గాయాలపాలైన వ్యక్తి వయసు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.7 అడుగులు ఉంటాడని, చామనఛాయతో ఉన్నాడని ట్రాఫిక్ సీఐ తెలిపారు. వ్యక్తిని గుర్తు పట్టినవారు గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

ప్రజా రవాణాను వాడుదాం.. కాలుష్యాన్ని నియంత్రిద్దాం


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి


సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహనపర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించి, కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.